సాక్షి తిరుపతి

మంగళవారం ౹ 29 ౹ ఏప్రిల్ ౹ 2025



దాడులు హేయమైన చర్య

ప్రత్యర్థులపై కక్ష్యపూరిత రాజకీయ దాడులు హేయమైన చర్య అని తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ధ్వజమెత్తారు. - 8లో



ప్రాణం తీసిన ఈత సరదా

ఈత సరదా ఓ బాలుడి ప్రాణాలు తీసింది. ఈ ఘటన చంద్రగిరి మండలంలో తీవ్ర విషాదాన్ని నింపింది. - 8లో



పథకం ప్రకారం చంపేశారు

'మా నాన్నను పథకం ప్రకారం చంపేశారు' అని అత్తివరం గ్రామానికి చెందిన మృతుని కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. - 8లో

న్యూస్‌రీల్

సోలార్ కెమెరాల ఏర్పాటుకు చర్యలు



సోలార్ కెమెరాలను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైమ్: నగరంలో 150 సోలార్ కెమెరాలను త్వరలో ఏర్పాటు చేయనున్నట్టు ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రూ.10 లక్షలతో 150 సోలార్ కెమెరాలను కొనుగోలు చేయనున్నట్టు పేర్కొన్నారు. సౌర శక్తి ద్వారా ఇవన్నీ పనిచేస్తాయని, దీని ద్వారా పర్యావరణం కూడా చాలా చక్కగా ఉంటుందన్నారు. ఇవన్నీ కూడా వైర్లెస్ కనెక్టివిటీతో పనిచేస్తాయన్నారు. మొబైల్ సిమ్ కార్డు ఆధారంగా ఇవన్నీ కూడా పనిచేస్తాయని చెప్పారు. తిరుమలలో శాంతిభద్రతల దృష్ట్యా 20 సోలార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. తిరుపతి, చంద్రగిరితో పాటు ముఖ్యమైన ప్రాంతాలలో వీటిని అమర్చేందుకు సిద్ధం చేసినట్టు తెలిపారు. ఇప్పటికే జిల్లాలోని వివిధ బ్లాక్ స్పాట్స్‌ను కూడా గుర్తించమన్నారు. ఏఎస్పీ రవిమనోహరాచార్య, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవ కమిటీ నియామకం



పెంచలకోన దేవస్థానం

రాపూరు: పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మే 8 నుంచి 14వ తేదీ వరకు జరిగే బ్రహోత్సవాలకు ఫెస్టివల్ కమిటీని నియమిస్తూ దేవదాయశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి సోమవారం ఉత్తర్వులు అందాయి. కమిటీ సభ్యులుగా చెన్ను తిరుపాల్‌రెడ్డి, రంగినేని వెంకటరమణయ్య, పీర్ల సోమయ్య, బొట్ట హజరత్ నాయుడు, తోట కృష్ణయ్య, శ్రీశైలం భార్గవరామ్, కిన్నెర నరసింహారావు, పెమ్మ సాయి సుగుణమ్మ, మోమిడి నరసింహులు, బోగులు భాస్కర్‌రెడ్డి, బొట్టల శివనాగేశ్వరావు, దాసరి భాస్కర్‌నాయుడు, ఎం.నవకృష్ణ చౌదరి, ఈ. యోగేశ్వరావును నియమించినట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. దేవస్థానానికి ధర్మకర్తల మండలి లేకపోవడంతో ఈ కమిటీని ఏర్పాటు చేసినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 102 అర్జీలు



ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు ఫిర్యాదులు అందజేస్తున్న బాధితులు

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 102 ఫిర్యాదులు అందినట్టు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఇందులో దొంగతనాలు, ఆస్తి తగాదాలు, ఆర్థికపరమైన లావాదేవీలు ఉన్నాయన్నారు. వెంటనే సంబంధిత అర్జీలు పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

పూజల పేరుతో ఘరానా మోసం


- 52 లక్షల మోసపోయాయని బాధితుల ఫిర్యాదు

తిరుపతి క్రైమ్: పూజలు చేస్తే మంచి జరుగుతుందని నమ్మించి రూ.52 లక్షలు మోసం చేసిన ఓ బురిడీ స్వామిపై అలిపిరి పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రుయా ఆస్పత్రిలో రిటైర్డ్ సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ వెంకటరమణకు 2022లో చెన్నైకి చెందిన మధియాలగన్ అలియాస్ మాధి స్వామి అనే వ్యక్తి తిరుమలలో పూజలు చేసే అర్చకుడిగా పరిచయమయ్యారు. ఈ క్రమంలో వెంకటరమణకు అనారోగ్యం, ప్రమాదాలు వంటి సమస్యలు ఉన్నాయని, రక్షణ కోసం పూజలు, హోమాలు చేయాలని నమ్మించాడు. దీంతో ఆయన మాటలు విని మోసపోయిన వెంకటరమణ రూ.52 లక్షల కుపైగా నగదు ఇచ్చాడు. అయితే పూజలు చేయకుండా పలుమార్లు శుభ సమయం కోసం ఎదురు చూస్తున్నానని నమ్మించాడు. ఈనెల 16వ తేదీన స్వామి కోసం తన నివాసం వద్దకు వెళ్లగా అప్పటికే ఇల్లు ఖాళీ చేసి పరారైనట్టు గుర్తించారు. మోసపోయానని తెలుసుకొని అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జగనే మా దైవం..

ప్రలోభాలకు లొంగం!

అసలే ముఖ్యమంత్రి నియోజకవర్గం.. ఓ వైపు బెదిరింపులు.. మరో వైపు దాడులు.. ఇంకో వైపు పదవులు, బహుమతుల ఎర.. ఇవన్నీ తృణప్రాయమన్న వైఎస్సార్ సీపీకి చెందిన 9 మంది కౌన్సిలర్లు.. టీడీపీ చూపిన ప్రలోభాలకు లొంగకుండా కుప్పం మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో పాల్గొన్న కౌన్సిలర్లు.. వీళ్లే మా నాయకులు అంటున్న ఆయా వార్డు జనం.. సోమవారం ప్రజాస్వామ్యంలో ఒక బ్లాక్‌గా అభివర్ణించుకున్న కుప్పం జనం.



బెంగళూరు క్యాంపు నుంచి చైర్మన్ ఎన్నికకు వచ్చిన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు

డబ్బు, పదవులకు లొంగని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

- ప్రలోభాలతో కుప్పం చైర్మన్‌గిరి టీడీపీ కైవశం
- ఎదురొడ్డి నిలబడిన తొమ్మిది మంది సభ్యులు
- కొనియాడుతున్న కుప్పం జనం
- తిక విజయం వైఎస్సార్ సీపీదే

కుప్పంరూరల్: హ్యాట్సాఫ్ వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు అని కుప్పం జనం మెచ్చుకుంటున్నారు. ఎందుకంటే ప్రలోభాలు, బెదిరింపులు, దాడులకు వెరవకుండా మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ పక్షాన నిలిచిన కౌన్సిలర్లుకు వందనం..శత వందనం.. మీరే నిజమైన మా నాయకులు అని కుప్పం జనం కొనియాడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎలాగైనా కుప్పం మున్సిపల్ చైర్మన్ గిరిని దక్కించుకోవాలని అధికార పార్టీ మదిలో పడింది. ఇందుకు అనుగుణంగానే ప్రణాళికలు సిద్ధం చేసింది. కుప్పం కౌన్సిల్‌లో ఉన్న సభ్యులకు బెదిరింపులు, వేధింపులు మొదలు పెట్టింది. మొదటగా నలుగురు కౌన్సిలర్లు టీడీపీకి సరెండర్ అయ్యారు. తరువాత 2024 నవంబర్‌లో డాక్టర్ సుదీర్ చైర్మన్, కౌన్సిలర్ పదవులకు రాజీనామా చేశారు. అప్పటివరకు ఉన్న కౌన్సిల్‌లో మార్పులు వచ్చాయి. చైర్మన్ రాజీనామా చేసి వెళ్లిపోగా, సభ్యుల సంఖ్య 24కు చేరింది. నలుగురు టీడీపీ వైపు వెళ్లిపోవడంతో వైఎస్సార్ సీపీకి ఉన్న బలం 19 నుంచి 14కు చేరింది. ఈ క్రమంలో రాష్ట్ర ఎన్నికల సంఘం మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు 28న ఎన్నికలు ఖరారు చేసింది. ఖరారు చేసినప్పటి నుంచి అధికార పార్టీ వైఎస్సార్ సీపీ వారిని రకరకాలుగా ప్రలోభాలకు గురిచేసింది. ఒక్కొక్కరికి రూ.50 లక్షలు ఆశ చూపింది. మరి కొంత మందికి ఉద్యోగం, మరొకరికి ఏకంగా చైర్మన్ పదవే ఆశ చూపారు. వీరి ప్రలోభాలకు నలుగురు ఆకర్షితులు కాగా, మరో ఇద్దరు ఓటింగ్‌కు దూరమయ్యారు. కానీ ఎమ్మెల్సీ భరత్ పాటు 9 మంది సభ్యులు మాత్రం రూ.లక్షల డబ్బు, ఉద్యోగాలు, పదవులు దేన్నీ లెక్క చేయక వైఎస్సార్ సీపీ తరఫున ఎన్నికల్లో పాల్గొన్నారు. ఓటమి దరిదాపుల్లోకి వచ్చినా ఎక్కడా వెరవక తమను ఎన్నుకున్న ప్రజలు, పార్టీ తరఫున నిలబడి ఎన్నికల్లో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ దొడ్డిదారి కొంత మంది కౌన్సిలర్లను కొని చైర్మన్ గిరి దక్కించుకోగా, వైఎస్సార్ సీపీ సభ్యులు మాత్రం నైతిక విజయం మాదే అంటు వెనుతిరిగి, కుప్పం జనం మనస్సు గెలుచుకున్నారు.

సోమవారం ప్రజాస్వామ్యంలో బ్లాక్ డే

సోమవారం జరిగిన ఎన్నికల్లో అధికార పార్టీ దౌర్జన్యాలు, అడ్డదారుల్లో మున్సిపల్ చైర్మన్ పదవి దక్కించుకోవడాన్ని కుప్పం ప్రజలు జీర్ణించుకోవడం లేదు. సోమవారం ఒక ప్రజాస్వామ్యంలో ఒక బ్లాక్ డేగా అభివర్ణిస్తున్నారు. 18 మంది కౌన్సిలర్ల బలం స్పష్టంగా ఉన్నా ఓడి పోవడం ఏమిటని ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు.

మా పయనం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే..

తాము మనస్సాక్షికి, తమను ఎన్నుకున్న ప్రజలకు కట్టుబడి ఉన్నామని, తమ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి నేర్పిన క్రమశిక్షణతో నడుచుకుంటామని 9 మంది అంటున్నారు. తమ నాయకుడు తమకు అడ్డదారులు నేర్పలేదని, డబ్బు, బహుమతులకు లొంగే అలవాట్లు నేర్పలేదన్నారు. ప్రజాసేవకే అంకితమైన తమ నాయకుడు చూపిన బాటలోనే నడుస్తామని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు అంటున్నారు. తమపై నమ్మకం ఉంచిన ప్రజలకు న్యాయం చేయడమే తమ అంతిమ చర్యగా పేర్కొంటున్నారు.

ప్రజాస్వామ్యం..అపహాస్యం

- కుప్పం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక దుర్మార్గం
- ధ్వజమెత్తిన వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: వైఎస్సార్‌సీపీని బలహీనపరచాలన్న దురాలోచనతో స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని చంద్రబాబు అపహాస్యం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కుప్పం మున్సిపల్ చైర్మన్ ఉప ఎన్నికపై సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు సొంత నియోజకవర్గమైన కుప్పం మున్సిపాలిటీలో టీడీపీకి బలం లేకపోయినా దుర్మార్గంగా వ్యవహరించిందన్నారు. ఆరుగురు కౌన్సిలర్లతో కుప్పం మున్సిపాలిటీని ఎలా కైవసం చేసుకోగలదని ప్రశ్నించారు. తన సొంత నియోజకవర్గంలో ఓటమి పాలవుతారన్న భయంతో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ఒక్కొక్కరినీ రూ.50లక్షలతో కొనుగోలు చేసినట్టు ఆరోపించారు. కేవలం పది నెలల పదవీ కాలం మాత్రమే ఉన్న కుప్పం మున్సిపాలిటీ ఎన్నికలో చంద్రబాబు ఇంతటి అరాచకాలు సృష్టించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎవ్వరైనా కూటమి ప్రభుత్వంలో చేరడానికి వస్తే చేర్చుకునే ప్రసక్తేలేదని చంద్రబాబు నీతులు వలకబోశారని గుర్తుచేశారు. గత రెండు నెలలుగా రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు అన్నీఇన్నీ కావన్నారు. తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తాడిపత్రి మున్సిపాలిటీలో టీడీపీ నుంచి ఇద్దరు కౌన్సిలర్లను వైఎస్సార్ సీపీ వైపు తిప్పుకుని ఉంటే తమ పార్టీనే చైర్మన్ పదవి చేపట్టి ఉండేదని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడా టీడీపీకి మెజారిటీ లేకపోయినా స్థానిక సంస్థల ఎన్నికల్లో కౌన్సిలర్లను, కార్పొరేటర్లను కొనేసి గెలుచుకున్నామంటూ గొప్పలు చెప్పుకోవడం చంద్రబాబు నీచ రాజకీయాలకు నిదర్శనమన్నారు. చంద్రబాబు అరాచకాలను రాష్ట్ర ప్రజలంతా గమనిస్తున్నారని, తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

మున్సిపల్ చైర్మన్‌గా సెల్వరాజ్



కుప్పం: కుప్పం మున్సిపల్ చైర్మన్‌గా టీడీపీ అభ్యర్థి సెల్వరాజ్ ఎన్నికయ్యారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారి కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులరాజు ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. మున్సిపాలిటీలో 24 మంది కౌన్సిలర్లు ఉండగా చైర్మన్ ఎన్నికల ఓటింగ్‌లో 22 మంది కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు. వీరిలో అధికార పార్టీ చైర్మన్ అభ్యర్థిగా సెల్వరాజ్‌ను ప్రతిపాదించగా ఆయనకు 19 వార్డు కౌన్సిలర్ దాము, 20వ వార్డు కౌన్సిలర్ సోములు సహకరించారు. వైఎస్సార్‌సీపీ చైర్మన్ అభ్యర్థిగా హఫీజ్ పార్టీ ప్రకటించగా ఆయనకు 2వ వార్డు సభ్యులు మునిరాజ్, 11వ వార్డు సభ్యురాలు మాధవి ప్రతిపాదించారు. ఈ ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారుడు సెల్వరాజ్‌కు 14 మంది చేతులెత్తి తమ మద్దతును పలికారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి హఫీజ్‌కు 9 మంది వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు మద్దతు పలికారు.

పాతభవనం ఉన్న చోటే వనరుచి క్యాంటీన్



చెట్లు నరికివేత పరిశీలిస్తున్న పీసీసీఎఫ్

తిరుపతి మంగళం : పాత భవనం ఉన్నచోటే వనరుచి క్యాంటీన్ ఏర్పాటు చేయనున్నట్టు ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(పీసీసీఎఫ్) పీవీ.చలపతిరావు తెలిపారు. పర్యావరణానికి నష్టం కలిగించేలా చెట్లను నరికి ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదన్నారు. తిరుపతి నగరవనంలో వనరుచి పేరుతో చెట్లను నరికివేతపై ఇటీవల పత్రికల్లో వచ్చిన కథనాలపై రాష్ట్ర అటవీశాఖ మంత్రి విచారణకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో పీసీసీఎఫ్ సోమవారం తిరుపతి నగరవనంలో చెట్ల నరికివేత, వనరుచి క్యాంటీన్ ఏర్పాటుపై విచారణ చేపట్టారు. అలాగే నగరవనంలో కొత్తగా నిర్మించిన వాకింగ్ ట్రాక్‌లు, పాత వాకింగ్ ట్రాక్లను పరిశీలించారు. వాకర్స్, సందర్శకులతో మాట్లాడి, వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరవనంలో కేఫ్ (వనరుచి) నిర్మాణం జరుపుకుంటున్న ప్రదేశం ఒకప్పుడు దివ్యారామం పార్కు కోసం నిర్మించిన భవన శిథిలాలు ఉన్నచోటుగా గుర్తించినట్టు తెలిపారు. అయితే పాతభవనం ఉన్న ప్రదేశం కంటే కొద్దిగా ఎక్కువ స్థలాన్ని సేకరించారన్నారు. వనరుచిని కూడా గతంలో పాతభవనం ఉన్న చోటే నిర్మించి ఉంటే బాగుండేదన్నారు. కానీ విస్తరణలో భాగంగా తురాయి, పచ్చతు రాయి చెట్లతోపాటు ఒక రావి, చిన్న వేప చెట్లను తొలగించినట్టు గుర్తించామన్నారు. అనంతరం ఆయన జీవకోన, ఐయోట్రిమ్, ఎర్రచందనం గోదాముల పరిధిలోని దెబ్బతిన్న ఇనుప కంచెను పరిశీలించారు. వన్యమృగాలు వస్తున్నాయన్న ఫిర్యాదుల మేరకు తగు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు.

ఈకేవైసీకి రెండు రోజులే గడువు

తిరుపతి అర్బన్: రేషన్ కార్డుదారుల ఈకేవైసీ ఈ నెల 30తో ముగియనుంది. జిల్లాలో 6,03000 రేషన్‌కార్డుల్లో 18.7 లక్ష మంది సభ్యులున్నారు. వీరంతా జిల్లాలోని 1,457 చౌకదుకాణాల్లో ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. ఈ నెల 30 వరకు సమయం ఉండడం .. ఇప్పటికీ 1.10 లక్షల మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉండడంతో టెన్షన్ పట్టుకుంది. వీరందరూ రెండు రోజుల్లో ఈకేవైసీ చేయించుకోకుంటే మేలో బియ్యం ఇవ్వమన అధికారులు తేల్చిచెప్పేశారు. రేషన్ కార్డులో నుంచి వారి పేర్లు సైతం తొలగిస్తామని హెచ్చరించారు. ఈకేవైసీ చేయించుకోవడానికి గడువు పెంచాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. గడుపు పెంపుపై ఆదేశాలు వస్తే పాటిస్తామని జిల్లా సివిల్ సప్లయ్ అధికారి శేషాచలం రాజు తెలిపారు.

ఏసీబీ వలలో శ్రీకాళహస్తి సర్వేయర్



పట్టుబడిన నగదుతో సర్వేయర్ పురుషోత్తంరెడ్డి



డీఎస్పీ విమల

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తికి చెందిన సర్వేయర్ పురుషోత్తంరెడ్డి లంచం తీసుకుంటూ సోమవారం ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఏసీబీ డీఎస్పీ విమల తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రశేఖర్‌రెడ్డి అనే సీనియర్ సిటిజన్ శ్రీకాళహస్తి పట్టణంలోని ఊరందూరుకు వెళ్లే మార్గంలో ఉన్న విశాలాక్షి నగర్‌లో 2000 సంవత్సరంలో 75 సెంట్లు భూమిని కొన్నాడు. అయితే అక్కడ కళాశాల నిర్మించాలనే తలంపుతో దానిని క్రమబద్ధీకరించేందుకు ఫిబ్రవరి 20వ తేదీన తహసీల్దారు కార్యాలయంలో సంప్రదించాడు. దీనిపై చలానా చెల్లించి తహసీల్దారుకు వినతిపత్రం అందించాడు. 21 రోజుల తర్వాత ఆయన వినతిని తిరస్కరించినట్టు తెలిసింది. మళ్లీ రెండో సారి దానిపై దరఖాస్తు చేశాడు. అయినా కాకపోవడంతో తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి దీనిపై తహసీల్దారు, సర్వేయర్‌ను ప్రశ్నించగా రూ.30 వేలు చెల్లిస్తే మీ పని అవుతుందని తెలిపారు. అంత ఇచ్చుకోలేనని రూ.15 వేలు ఇస్తానని ప్రాధేయపడ్డాడు. కుదరదని రూ.25 వేలు ఇస్తేనే మీ పని అవుతుందని గట్టిగా చెప్పారు. గత్యంతరం లేక రూ.25 వేలు చెల్లించడానికి ఒప్పుకుని వెళ్లిపోయాడు. అయితే లంచం ఇవ్వడం ఇష్టం లేక చంద్రశేఖర్‌రెడ్డి ఏసీబీని సంప్రదించాడు. సోమవారం ఉదయం ఏసీబీ అధికారులు చంద్రశేఖర్‌రెడ్డికి రూ.25వేలు నగదు ఇచ్చి కార్యాలయంలోకి పంపారు. డీఎస్పీ విమల తన బృందంతో శ్రీకాళహస్తి తహసీల్దారు కార్యాలయం బయటే వేచి ఉన్నారు. చంద్రశేఖర్‌రెడ్డి లోపలకు వెళ్లి సర్వేయర్ పురుషోత్తంరెడ్డికి రూ.25వేలు లంచం అందజేశాడు. అనంతరం ఏసీబీ అధికారులు పురుషోత్తంరెడ్డిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని తహసీల్దారు కార్యాలయంలో సోదాలు చేపట్టారు. సెలవులో ఉన్న తహసీల్దారు లక్ష్మీనారాయణను పిలిపించి విచారణ చేపట్టామని డీఎస్పీ తెలిపారు. అయితే ఈ వ్యవహారం వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా..? అనే దానిపై విచారణ చేస్తున్నామని తెలిపారు. ఈ దాడుల్లో డీఎస్పీ జెస్సీ, ప్రశాంతి, సీఐ నరసింహ తదితర అధికారులు పాల్గొన్నారు.

రక్తసిక్తం!

కారు నుంచి బయటకు తీసిన మృతదేహాలు





తిరుమలకు వెళ్లి వస్తూ.. తిరిగిరాని లోకాలకు

- జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం
- కంటైనర్ కిందకు దూసుకెళ్లిన కారు
- ఐదుగురు మృతి
- ఘటనా స్థలిని సందర్శించిన కలెక్టర్, ఎస్పీ

తిరుపతి రూరల్/ పాకాల: చంద్రగిరి నియోజకవర్గం, పాకాల మండల పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. కంటైనర్ కిందకు కారు దూసుకెళ్లడంతో ఐదుగురు మృత్యువాత పడ్డారు. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు.. తమిళనాడు రాష్ట్రం, క్రిష్ణగిరి జిల్లా, హోసూరు వద్దనున్న జీఆర్‌బీ ఫుడ్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ కంపెనీలో ఎస్ఆర్ రజని, త్యాగరాజన్ పనిచేస్తున్నారు. వీరిద్దరూ మంచి మిత్రులయ్యారు. ఆ రెండు కుటుంబాలు తరచూ విహార యాత్రలు, ఆధ్యాత్మిక పర్యటనలకు వెళుతుంటాయి. ఈ క్రమంలో తిరుమల శ్రీవారి దర్శనార్థం వెళ్లాలనుకున్నారు. ఈ క్రమంలో త్యాగరాజన్, ఎస్.ఆర్.రజని తమ కంపెనీలో పనిచేస్తున్న మరొక ఉద్యోగి కనక రాజ్ కారును ఈనెల 25వ తేదీ రాత్రి తీసుకున్నారు. ఎస్.ఆర్ రజని తన భార్య సహాన, కుమారుడు లేఖన్ గాడ్, తల్లి గీతమ్మ, అత్త విజయలక్ష్మితో పాటు త్యాగరాజన్, అతని కుమారుడు క్రిస్‌విన్‌తో కలసి హోసూరు నుంచి బయలుదేరి శనివారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు. అనంతరం ఆదివారం శ్రీవారిని దర్శించుకుని ఆ రాత్రి అక్కడే బసచేసి సోమవారం ఉదయం తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆ తరువాత అక్కడి నుంచి హోసూరు వెళ్లేందుకు తిరుగు ప్రయాణమయ్యారు. గత రెండు రోజులుగా నిరాటంకంగా కారు నడపడం, తిరుమలలో స్వామివారి దర్శనానికి గంటల తరబడి నిరీక్షించడం, ఎండ తీవ్రతకు బాగా అలసి పోవడంతో కారులో నుంచి వచ్చే ఏసీ గాలికి అందరూ నిద్రలోకి జారుకున్నారు. మరో మూడు గంటల్లో గమ్యస్థానానికి చేరుతామనగా మృత్యుదేవత కబలించింది.

మృత్యు కంటైనర్

అమ్మవారి ఆలయం నుంచి ఇంటికి బయలుదేరిన వారిని కంటైనర్ రూపంలో మృత్యువు కడతేర్చింది. అతివేగంగా కారు నడపడం వల్లనే ముందు వెళుతున్న కంటైనర్‌ను అధిగమించబోయి ఢీ కొట్టినట్టుగా పోలీసుల ప్రాథమికంగా నిర్ధారించారు. పట్టపగలు జాతీయ రహదారిపై జరిగిన ఘోర ప్రమాదంతో వాహనాలు కొంత మేరకు స్తంభించాయి.

సూదరం ప్రాంతం నుంచి వచ్చి తిరుమలేశుని దర్శించి పునీతమయ్యారు. ఆధ్యాత్మిక వాతావరణాన్ని మనసారా ఆస్వాదించి పులకించిపోయారు. వెంకన్న క్షేత్రంలో గ్రూప్ ఫొటోలు తీసుకుని మురిసిపోయారు. దేవదేవుడి కొలువులో గడిపిన మధుర క్షణాలను నెమరు వేసు కుంటూ తిరుగు ప్రయాణమయ్యారు. మరో మూడు గంటల్లో గమ్యం చేరుకోవచ్చని భావించారు. ఇంతలో మృత్యువు కంటైనర్ రూపంలో దూసుకొచ్చింది. నిర్దాక్షిణ్యంగా ఐదుగురిని పొట్టనబెట్టుకుంది. మరో ఇద్దరిని రక్తగాయాలతో ఆస్పత్రి పాలు చేసింది. ఈ విషాద ఘటన చంద్రగిరి నియోజకవర్గంలో సోమవారం తీవ్ర విషాదాన్ని నింపింది.





అంబులెన్స్‌లోకి క్షతగాత్రులను ఎక్కిస్తున్న పోలీసులు, కారులోనే ఇరుక్కున్న మృతులు

ఘటనా స్థలిని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

రోడ్డు ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, డీఎస్పీ ప్రసాద్ పరిశీలించారు. కంటైనర్ డ్రైవర్‌తో మాట్లాడి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడి నుంచి తిరుపతి రుయాకు చేరుకుని క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. గీతమ్మకు రుయాలో చికిత్స అందిస్తుండగా క్రిస్‌విన్ పరిస్థితి విషమంగా ఉండడంతో స్విమ్స్‌కు తరలించి వైద్యం అందిస్తున్నారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం



స్విమ్స్‌లో క్షతగాత్రులను పరామర్శిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి తుడా: స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పరామర్శించారు. సీఎం ఆదేశాల మేరకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని క్షతగాత్రులకు ధైర్యం చెప్పారు.



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.97,900
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.8,887
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.99,100
రిటైల్ వెండి గ్రాము	రూ.102.10

ఇసుక లేదట..!

తేల్చి చెప్పేసిన అధికారులు

- గూడూరు, పెళ్లకూరులోని 1.37,686 మెట్రిక్ టన్నుల ఇసుక ఏమైందో...?
- తొలి దశలో అన్నమయ్య జిల్లా నుంచి ఏజెన్సీలతో ఇసుక పంపిణీ
- రెండో దశలో నెల్లూరు జిల్లా నుంచి ఏజెన్సీలతో..
- మే 1 వరకు దరఖాస్తులకు ఆహ్వానం
- వెంకటగిరిలో టన్ను ధర రూ.575
- శ్రీకాళహస్తిలో టన్ను ధర రూ.676?



నెల్లూరు నుంచి ఇసుక తెప్పించుకుని వ్యాపారం చేసుకోవడానికి దరఖాస్తుల స్వీకరణపై మైనింగ్, ఇరిగేషన్ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్ (ఫైల్)

తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లాలో ఇసుక లేదంటూ అధికారులు 7నెలలు తర్వాత తేల్చిచెప్పేశారు. పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని పల్లిపాడు సెమి మెకనైజ్డ్ సాండ్ రీచ్ నుంచి ప్రైవేటు వ్యక్తులు ఏజెన్సీల ఆధ్వర్యంలో ఇసుకను తెప్పించుకుని వెంకటగిరి, శ్రీకాళహస్తిలో ఇసుక స్టాక్ యార్డులను ఏర్పాటు చేసుకునే అవకాశం కలిప్తున్నట్లు రెండు రోజుల క్రితం కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రకటించారు. ఏజెన్సీలకు చెందిన వారు నెల్లూరు నుంచి ఇసుక తెచ్చుకుని వెంకటగిరిలో టన్ను ఇసుక ధర రూ.575 చొప్పున, శ్రీకాళహస్తిలో రూ.676 చొప్పున మాత్రమే విక్రయించాలని, ఇందుకుగాను ఏజెన్సీలు మే 1వ తేదీ నాటికి సొంత భూమి లేదా లీజు భూమికి చెందిన పత్రాలతో సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులను కలెక్టరేట్‌లోని మైనింగ్ అధికారులకు ఇవ్వాలని ప్రకటించారు. మే 2న సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులను పరిశీలించి ఖరారు చేస్తామని స్పష్టం చేశారు. దరఖాస్తుకు సంబంధించి అదనపు సమాచారం కోసం జిల్లా గనులు భూగర్భశాఖ అధికారులకు చెందిన 9100688839, 9000373069 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

జూలై 8న ఉచిత ఇసుక పాలసీ ఇలా..

గత ఏడాది జూలై 8న ఉచిత ఇసుక పాలసీని కూటమి ప్రభుత్వం అమల్లోకి తీసుకురావడం విదితమే. జిల్లాలో నాలుగుచోట్ల మాత్రమే ఇసుక స్టాక్ పాయింట్లు అప్పట్లో ఏర్పాటు చేశారు. ఉచిత ఇసుక పాలసీగా పేర్కొన్నప్పటికీ టన్నుల కొద్దీ ఇసుకను విక్రయించారు. వెంకటగిరి మొగళ్ల గుంటలో టన్ను ఇసుక రూ.590కి, సూళ్లూరుపేట మావిళ్లపాడులో రూ.465, పిచ్చాటూరు ఏకే బేడులో రూ.200, నాగలాపురంలోని సుబ్బానాయుడు కండ్రిగ వద్ద రూ.200ల చొప్పున విక్రయించారు. అయితే సెప్టెంబర్ 24 వరకు మాత్రమే అరకొరగా ఇసుకను ఇచ్చిన అధికారులు ఆ తర్వాత స్టాక్ లేదంటూ వాటిని మూసేశారు.

డిసెంబర్‌లో ఏజెన్సీలతో..అన్నమయ్య ఇసుక

సెప్టెంబర్ 24 తర్వాత ఇసుక కొరతతో జగనన్న లేఔట్లతోపాటు ప్రజల ఇళ్ల నిర్మాణాలకు బ్రేక్ పడింది. అనంతరం మూడు నెలలు తర్వాత గత ఏడాది డిసెంబర్ 20న ప్రైవేటు ఏజెన్సీలు అన్నమయ్య జిల్లా నుంచి ఇసుకను తెచ్చుకుని జిల్లాలో విక్రయించుకోవడానికి అనుమతులు ఇచ్చారు. ఆ మేరకు అన్నమయ్య ఇసుకను గాజులమండ్యం, కాటన్ మిల్, అవిలాల వద్ద మూడు ఇసుక స్టాక్ యార్డులను గత ఏడాది డిసెంబర్‌లో ఏర్పాటు చేశారు. టన్ను ఇసుక రూ.600లకు పైగా రేటు పెట్టి మూడు నెలలు పాటు విక్రయించారు. అయితే గిట్టుబాటు కాలేదంటూ మార్చి 20న దీనికి ఫుల్ స్టాప్ పెట్టారు. ఆ తర్వాత రెండో దశలో ఇసుక పాలసీ తెస్తామని అధికారులు ప్రకటించారు.

ఇష్టారాజ్యంగా జిల్లాలో ఇసుక వ్యాపారం

జిల్లాలో స్వర్ణముఖి నది ఆధారంగానే కాకుండా వాగులు, వంకల్లో నుంచి ఇష్టారాజ్యంగా ఇసుక వ్యాపారం సాగుతోంది. శ్రీకాళహస్తితోపాటు పలు ప్రాంతాల్లో స్వర్ణముఖి నదిని హిందువులు శ్మశానవాటిగా వినియోగిస్తున్నారు. ఇసుక అక్రమ తవ్వకాలతో తమ పెద్దలు, ఆత్మీయుల సమాధులు సైతం పెకలించి వేస్తున్నాఆరని పలువురు లబోదిబోమంటున్నారు. రోజూ జిల్లాలో టన్నుల కొద్దీ ఇసుక అక్రమంగా రవాణా అవుతున్నా జిల్లాలో ఇసుక లేదని అధికారులు ప్రకటించడంపై విమర్శలు వస్తున్నాయి.

ఆ ఇసుక ఏమైందో..?

స్వర్ణముఖి నదీ తీరప్రాంతానికి సంబంధించి కోట మండలంలోని గూడలి వద్ద ఒక ఇసుక పాయింట్, పెళ్లకూరు మండలంలోని పుల్లూరు వద్ద రెండు ఇసుక పాయింట్లు గుర్తించామని వెల్లడించారు. ఈ ఇసుక పాయింట్ల వద్ద 1,37,686 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయని కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులు పలు సమావేశాలు నిర్వహించి మీడియాకు సమాచారం ఇచ్చారు. దీంతో అంతా ఆశగా ఎదురుచూస్తూ వచ్చారు. అయితే ఆ ఇసుకను కొందరు టీడీపీ నేతలు తవ్వి వ్యాపారం చేసినట్లు ప్రచారంలోకి వచ్చింది. దీంతో ఇక చేసేదేమీ లేక తాజాగా రెండు రోజుల క్రితం ఇరిగేషన్, మైనింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో ఇసుక లేకపోవడంతో నెల్లూరు జిల్లా నుంచి ఇసుక తెప్పించుకుని మళ్లీ ఏజెన్సీలకు అప్పగించడానికి దరఖాస్తులకు ఆహ్వానం పలికారు. వెంకటగిరిలో టన్ను రూ.575, శ్రీకాళహస్తిలో రూ.676 చొప్పున విక్రయించడానికి శ్రీకారం చుట్టారు. రెండో దశగా ఏర్పాటు చేస్తున్న ఏజెన్సీల ఇసుక వ్యవహారం ఎంతకాలం నడుస్తుందో వేచి చూడాల్సి ఉంది.

సూచిక బోర్డుల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

తిరుపతి తుడా: స్విమ్స్ ఆస్పత్రిలో మెడికల్ షాపులకు చెందిన సూచిక బోర్డులు ఎక్కువగా ఉన్న వాటిని తొలగించాలని షాపు యాజమాన్యాలను ఆదేశిఅంచినట్టు మెడికల్ సూపరింటెండెంట్ తెలిపారు. ‘సాక్షి’లో సోమవారం ‘స్విమ్స్‌లో మెడికల్ మాఫియా’ అనే శీర్షికన ప్రచురితమైన వార్తను ఖండిస్తున్నట్లు తెలిపారు.

రైలు పైకెక్కి.. హైటెన్షన్ తీగలు తగిలి!

తిరుపతి క్రైమ్: రైలు పైకెక్కి... హైటెన్షన్ వైరు తగిలి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం.. సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయసు గల వ్యక్తి తిరుపతి – రేణిగుంట మధ్యలో రిలయన్స్ బ్రిడ్జి వద్ద హరిప్రియ ఎక్స్‌ప్రెస్ రైలును పిట్ లైన్లో పెట్టే సందర్భంలో రైలు పైకి ఎక్కాడు. రైలుపై ఉన్న హై టెన్షన్ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- బావిలో దూకి విద్యార్థి మృతి



బషీర్ మృతదేహం

చంద్రగిరి: సరదాగా ఈత కొట్టేందుకు బావిలోకి దూకిన విద్యార్థి మృతి చెందిన ఘటన చంద్రగిరిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మండల పరిధిలోని బుచ్చినాయుడుపల్లి పంచాయతీ, శంకయ్యగారిపల్లికి చెందిన నూర్‌జాన్ భర్త చనిపోవడంతో కుమారుడు బషీర్(15)తో కలసి చంద్రగిరి కొత్తపేటలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటోంది. కుమారుడు బషీర్ స్థానిక పాలిటెక్నిక్ కళాశాలల మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం బషీర్‌తో పాటు మరో నలుగురు స్నేహితులు చంద్రగిరి దిగువ వీధిలోని బావిలో ఈత కొట్టేందుకు వెళ్లారు. ఈ క్రమంలో ఈత కొట్టేందుకు బావిలోకి దూకినట్లు బషీర్ ఎంతకీ పైకి రాకపోవడంతో స్నేహితులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో సుమారు రెండు గంటల పాటు గల్లంతైన యువకుడి కోసం గాలించారు. ఆపై ఏ.రంగంపేటకు చెందిన ఎంపీటీసీ బోసు రెడ్డికి సమాచారం అందించారు. అనంతరం ఆయన గజ ఈతగాళ్లైన నరేష్, పురుషోత్తంతో కలసి పాతాళభైరవి సాయంతో బావిలో మునిగిపోయిన విద్యార్థి మృతదేహాన్ని బయటకు తీశారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లి నూర్‌జాన్‌తో పాటు బంధువులు బోరున విలపించారు. అనంతరం మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరు కిలోల గంజాయి స్వాధీనం



గంజాయితోపాటు నిందితుడిని చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

చిల్లకూరు: ఆరు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఘటన ఆదివారం రాత్రి గూడూరు పరిధిలో చోటు చేసుకుంది. గూడూరులోని ఎక్సైజ్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ కరీమాభేగం మాట్లాడుతూ తమిళనాడుకు చెందిన సెల్వకుమార్ గూడూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగ ఉండడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్నారు. తనిఖీ చేయగా ఆరు కిలోల గంజాయి ఉన్నటుగుర్తించి స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. నర్సీపట్నం నుంచి గంజాయిని కొనుగోలు చేసుకుని తమిళనాడులోని సేలం జిల్లా, చెట్టిపట్టి గ్రామంలో విక్రయించేందుకు తీసుకెళుతున్నట్లు విచారణలో తేలిందన్నారు. ఈ మేరకు ముద్దాయిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్టు తెలిపారు. గంజాయి విలువ రూ.30 వేలు ఉంటుందన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ శేషమ్మ, సిబ్బంది చెంచయ్య, నారాయణయ్య, మనోహర్, రవి పాల్గొన్నారు.

బీసీ హాస్టళ్ల విద్యార్థులకు ప్రశంసలు



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో కలెక్టర్, బీసీ వెల్ఫేర్ హాస్టల్స్ వార్డెన్లు

తిరుపతి అర్బన్: జిల్లాలోని బీసీ వసతి గృహాల్లో చదువుకుంటూ పది, ఇంటర్ విద్యార్థుల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కలెక్టర్ వెంకటేశ్వర్ అభినందించారు. పదో తరగతిలో సీ.మాధురి 585, ఎం.పల్లవి 561, కే.వెంకటేష్ 559, ఏ.సిరి 555, ఎస్.కె.ముజీఫ్ 552తోపాటు ఇంటర్‌లో పీ.లక్ష్మీప్రసాద్ 981, ఎన్.ప్రీతిజింతా 957కు ప్రశంసాపత్రాలతోపాటు మెమెంటోలు అందించారు. జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి రాజేంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

గాడిన పెట్టేనా?

- ఎస్వీయూ సీఈగా బాధ్యతలు చేపట్టిన రాజమాణిక్యం

తిరుపతి సిటీ: ఎస్వీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా డాక్టర్ రాజమాణిక్యం సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇంజినీరింగ్ విభాగంలో డిప్యూటీ రిజిస్ట్రార్‌గా ఉన్న ఆయన ఎగ్జామినేషన్ సెక్షన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా వర్సిటీ నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గుర్రంకొండ శ్రీధర్, నెల్లూరు సుబ్రమణ్యం, ఉపాధ్యక్షులు కోటగారం మురళి, సభ్యులు ఘనంగా సన్మానించారు.

ముళ్లకిరీటమే!

నూతన సీఈగా బాధ్యతలు చేపట్టిన రాజమాణిక్యంకు ఆ పదవి ముళ్లకిరీటం కానున్నట్లు వర్సిటీలో పెద్ద చర్చ జరుగుతోంది. ఎగ్జామినేషన్ సెక్షన్ అవినీతి మయంగా మారడం, ఇటీవల జరిగిన కొన్ని ఘటనలతో ఉద్యోగులను పెద్ద సంఖ్యలో బదిలీ చేశారు. గత కొన్ని నెలలుగా జరిగిన కొన్ని పీజీ, యూజీ కోర్సులకు వర్సిటీ ఫలితాలను విడుదల చేయ లేదు. నూతన సీఈ ఆయా పరీక్షల ఫలితాల విడుదలపై దృష్టి సారించాల్సి ఉంది.



బాధ్యతలు చేపట్టిన సీఈని సన్మానిస్తున్న నాన్ టీచింగ్ అసోసియేషన్ సభ్యులు

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

తిరుపతి అర్బన్: పీఎం అనుసుచిత్ జాతి అభ్యుదయ్ యోజన్ (పీఎం అజయ్)పథకం కింద ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ అసిస్టెంట్ డైరెక్టర్ సతీష్‌చంద్ర తెలిపారు. ఇందులో భాగంగా షెడ్యూల్ కులాలకు చెందిన నిరుద్యోగులకు వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో ఉచిత శిక్షణతోపాటు ఉపాధి కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. శిక్షణాకాలంలో భోజన సదుపాయంతోపాటు స్టేషనరీ అందజేస్తామని తెలిపారు. ప్రముఖ పరిశ్రమల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అనుగుణంగా శిక్షణ ఉంటుందని వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు తిరుపతి అలిపిరి రోడ్డులోని ఎస్వీ మెడికల్ కళాశాల ఎదురుగా ఉన్న నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అదనపు సమాచారం కోసం 9700413939, 9866241270, 9676474274, 7981155147లో సంప్రదించాలని తెలిపారు.

కక్ష పూరిత దాడులు హేయమైన చర్య

- దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలి
- టీడీపీ గూండాల పాపాలు పండే రోజులు దగ్గరలోనే ఉన్నాయి
- బాధితులను పరామర్శించిన చంద్రగిరి నియోజకవర్గం ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



ధ్వంసమైన వ్యాను అద్దాలను పరిశీలిస్తున్న మోహిత్‌రెడ్డి

పాకాల: జల్లికట్టులో వైఎస్సార్‌సీపీ పలకలు కట్టారనే నెపంతో టీడీపీ గూండాలు చేసిన దాడిలో గాయపడ్డ బాధితులను వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్, తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పరామర్శించారు. సోమవారం ఆయన అమ్మగారిపల్లి గ్రామానికి చేరుకుని బాధితులు ఉదయ్, జనార్దన్‌ను పరామర్శించారు. కంబాలమిట్ట జల్లికట్టులో జరిగిన గొడవకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దాడి చేసిన టీడీపీ గూండాల వివరాలను, వారు చేసిన ఆగడాలను బాధితులు మోహిత్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ధ్వంసమైన జనార్దన్‌కు సంబంధించిన వ్యాన్‌ను పరిశీలించారు. రాజకీయ కక్ష్యతో వ్యక్తిగత దాడులు చేయడం హేయమైన చర్య అని అభివర్ణించారు. చంద్రగిరి డీఎస్పీ, పాకాల సీఐకి ఫోన్ చేసి దాడులకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలని కోరారు.

మా సహనాన్ని పరీక్షించొద్దు

టీడీపీ గూండాలు దాడులు చేస్తూ ఉంటే చేతులు కట్టుకుని చూస్తూ ఊరుకోబోమని మోహిత్‌రెడ్డి హెచ్చరించారు. తమ సహనాన్ని పరీక్షిస్తున్నారని, టీడీపీ నాయకులు చేస్తున్న ఆగడాలను ప్రజలు గమనిస్తున్నారని గుర్తుచేశారు. కార్యకర్తల జోలికొస్తే ఎంత దూరమైనా వెళతానని, వారి కోసం ఆందోళన చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నామన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు అధైర్యపడకుండా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ దాడులు చేసిన వారిని వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు.



విశ్వనాథరెడ్డి కుటుంబీకులకు పరామర్శ

ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఎస్.విశ్వనాథరెడ్డి కుటుంబాన్ని మోహిత్‌రెడ్డి పరామర్శించారు. పాకాల శివశక్తి నగర్‌లోని మృతుని నివాసానికి చేరుకున్న ఆయన విశ్వనాథరెడ్డి భార్య, పాకాల ఎంపీటీసీ–2 ఎస్.స్వర్ణ, ఆమె కుమారులు గణపతి, సునీల్‌ని ఓదార్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశం

తిరుపతి ఎడ్యుకేషన్ : విద్యా హక్కు చట్టం ప్రకారం జిల్లాలోని ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి 1వ తరగతిలో 25 శాతం సీట్లకు ఉచితంగా ప్రవేశం కల్పించనున్నట్లు డీఈఓ కేవీఎస్.కుమార్ ఒతెలిపారు. ఇందులో భాగంగా అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధితుల పిల్లలు, దివ్యాంగులకు–5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బీసీ, మైనారిటీ, ఓసీ పిల్లలకు 6 శాతం సీట్లను కేటాయించనున్నట్లు తెలిపారు. ఇదివరకు ఈ నెల 28 నుంచి దరఖాస్తు చేసుకోవాల్సి ఉందని, అయితే మారిన షెడ్యూల్ మేరకు మే 2 నుంచి 19వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల డేటా ఆధారంగా విద్యార్థుల అర్హత పరిశీలనను మే 20 నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తారని, మే 29న లాటరీ పద్ధతిలో మొదటి విడత, అలాగే జూన్ 11న రెండో విడతన విద్యార్థుల జాబితాను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఐబీ/సీబీఎస్‌ఈ/ఐసీఎస్‌ఈ సిలబస్ పాఠశాలల్లో ప్రవేశాలకు మార్చి 31, 2025 నాటికి, అలాగే స్టేట్ సిలబస్ పాఠశాలల్లో ప్రవేశాలకు మే 31, 2025వ నాటికి 5 ఏళ్లు నిండిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ‘సీఎస్‌ఈ.ఏపీ.జీఓవీ.ఇన్’ అనే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, అలాగే ప్రస్తుత చిరునామా ధ్రువీకరణకు ఆధార్ కార్డు/ ఓటరు ఐడీ/రేషన్‌కార్డు/భూమి హక్కుల పత్రం/ఉపాధి హామీ జాబ్ కార్డు/పాస్‌పోర్ట్/డ్రైవింగ్ లైసెన్స్/విద్యుత్ బిల్లు /అద్దె ఒప్పంద పత్రంలో ఏవైనా ఒకటి సమర్పించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 1800 425 8599 టోల్ ఫ్రీ నంబరులో సంప్రదించాలని డీఈఓ సూచించారు.

అక్రమంగా ఉద్యోగాలు పొందిన వారిపై కేసు నమోదు

తిరుపతి క్రైమ్: తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఐదుగురు అక్రమ దారిలో ఉద్యోగాలు పొందారన్న ఈవో ఉదయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఈస్ట్ పోలీసులు తెలిపారు. వారు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఆలయంలో పనిచేసే వాయిద్యకారులు అయ్యప్ప, రెడ్డెమ్మ, శివశంకర్, సుబ్బయ్య, జయరాములు ఉద్యోగం ఎలా పొందారనే దానిపై స్పష్టత లేదని తెలిపారు. ఇందులో దేవదాయ శాఖ అధికారి సంతకం కూడా ఫోర్జరీ చేసినట్టు ప్రాథమిక విచారణలో తేలిందని పేర్కొన్నారు. ఈ క్రమంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

పథకం ప్రకారమే చంపేశారు!

- పోలీసులకు ఫిర్యాదు చేసిన మృతుని బంధువులు



మృతుడు గురుమూర్తి

నాయుడుపేట టౌన్: ‘మా నాన్నను పథకం ప్రకారం హత్య చేశారు. ఆపై రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించారు. మాకు న్యాయం చేయండి’ అంటూ మృతుని బంధువులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండల పరిధిలోని కోనేటిరాజుపాళెం – ద్వారకాపురం గ్రామాల మధ్య రహదారిలో ఆదివారం రాత్రి ఓ వాహనం ఢీకొనడంతో ఓజిలి మండలం, అత్తివరం గ్రామానికి చెందిన టీడీపీ నేత ఎల్లు గురుమూర్తి(52) దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. అయితే గురుమూర్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందలేదని, కొంతమంది టీడీపీ నేతలే పథకం ప్రకారం హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించారని మృతుని కుమారుడు ఎల్లు గురుతేజ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు పలు పార్టీల నాయకులు గురుమూర్తి మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలిపారు. ఎస్ఐ స్వప్న ఆధ్వర్యంలో గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నాం

ఎల్లు గురుమూర్తి మృతి విషయమై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ చెంచెబాబు తెలిపారు. ప్రమాదానికి కారణమై వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి కుమారడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 103(1), 109, 238, 47, 61(2), రెడ్‌విత్ 3(5) సెక్షన్లతో బీఎన్ఎస్ యాక్టు ప్రకారం కేసు నమోదు చేసినట్టు వెల్లడించారు.

డిగ్రీ పరీక్ష వాయిదా

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో బుధవారం(30వ తేదీన) జరగనున్న డిగ్రీ అన్ని కోర్సులకు సంబంధించిన పరీక్షను వచ్చే నెల 15వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ రాజమాణిక్యం తెలిపారు. బుధవారం పాలిసెట్–2025 పరీక్ష జరగనున్న నేపథ్యంలో డిగ్రీ 2వ, 4వ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

ఏనుగుల నియంత్రణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్



మాట్లాడుతున్న సీసీఎఫ్ సెల్వం

తిరుపతి మంగళం : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఏనుగుల నియంత్రణకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీశాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయనున్నట్టు తిరుపతి జిల్లా అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సీసీఎఫ్) సెల్వం తెలిపారు. సోమవారం సీసీఎఫ్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్‌కు హెడ్‌గా తిరుపతి జిల్లా అటవీశాఖ అధికారి వివేక్ వ్యవహరిస్తారన్నారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని భాకరాపేట, పనబాకం, తిరుపతి రెంజ్, చిత్తూరు ఈస్ట్, చిత్తూరు వెస్ట్ రేంజ్‌లలో ఏనుగుల దాడుల నుంచి ప్రజలను కాపాడుతామన్నారు. ఒక్కో రేంజ్‌లో పది మంది ఎలిఫెంట్ ట్రాకర్స్ ఉంటారని, వీరు ఆయా గ్రామాల పరిధిలో ఏనుగుల సంచారాన్ని గుర్తించి స్థానిక ప్రజలను అప్రమత్తం చేస్తారని తెలిపారు. సౌర విద్యుత్ ద్వారా పనిచేసే ఈ నూతన టెక్నాలజీ జీఎస్ఎమ్ సిమ్ ద్వారా ఏనుగుల కదలికలను బట్టి తిరుపతిలో ఏర్పాటు చేయబోయే కమాండ్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందుతుందన్నారు. ఏనుగుల గుంపు కనపడితే టోల్ ఫ్రీ నం.1800 425 5909, తిరుపతి డీఎఫ్ఓ 9440810069, చిత్తూరు డీఎఫ్ఓ 9440810113, తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్ఓ 9440810070, పీలేరు ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్ఓ 9440810114కు సమాచారం ఇవ్వాలని కోరారు.

క్షేత్ర స్థాయిలోనే పరిష్కరించండి

- గ్రీవెన్స్‌కు 285 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

తిరుపతి అర్బన్: చిన్న చిన్న సమస్యలను క్షేత్ర స్థాయిలోనే పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. గ్రీవెన్స్‌కు వచ్చే అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి మొత్తం 285 అర్జీలు వచ్చాయి. అందులో 145 అర్జీలు రెవెన్యూ సమస్యలపైనే ఉన్నాయి. కలెక్టర్‌తోపాటు జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, రోజ్‌మాండ్, సుధారాణి తదితరులు అర్జీలు స్వీకరించారు.

సీహెచ్‌వోలు నిరసన

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. నెలలు తరబడి తమ సమస్యల కోసం ఉన్నతాధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు.

అంతా ఖాళీ

కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌కు ప్రాధాన్యత తగ్గిపోయింది. గ్రీవెన్స్ చాంబర్ ముందు భాగంలో ఏర్పాటు చేసిన కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి.



గ్రీవెన్స్ అధికారుల చాంబర్ ముందు జనం లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

పింఛన్ ఇప్పించండి సారూ



అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యా. పింఛన్ ఇప్పించి ఆదుకోండి. పేద కుటుంబానికి చెందిన వాళ్లం. అధికారులు సాయం చేస్తారని కలెక్టరేట్‌కు వచ్చాం. పింఛన్ ఇస్తే మందులు కొనుగోలు చేసుకుంటాం.

– మునెమ్మ, మల్లవరం